క్లుప్తంగా

నేడు బీజేపీ నియోజకవర్గ సమావేశం

మక్తల్: బీజేపీ నియోజకవర్గ సమావేశం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, ముఖ్యనాయకులు తదితరులు విధిగా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

ప్రమాదకరంగా వంతెన



మాగనూర్: మండల పరిధిలోని నేరడగం సమీపంలోని పెద్దవాగుపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై ఉన్న సైడ్ రెయిలింగ్ ఒకవైపు కూలిపోయింది. మరోవైపు బ్రిడ్జి మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు భయందోళన చెందుతున్నారు. ముఖ్యంగా లోలైవల్ వంతెన కావడంతో వర్షకాలం ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయి. అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు నిర్మించడంతో పాటు సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించాలి

నారాయణపేట రూరల్: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు విజ్ఞప్తి చేశారు. పాలమూర్ ముద్దుబిడ్డ, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం, నారాయణపేటలో తొలి మహిళ చిట్టెం పర్ణికా రెడ్డి, మక్తల్‌లో బీసీ నాయకుడు వాకిటి శ్రీహరి గెలవడంపై అభినందనలు తెలిపారు. చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న అపరిష్కృత సమస్యలను వీలైనంత తొందరలో పూర్తిచేయాలని కోరారు. కొత్త ప్రభుత్వ, స్థానిక ఎమ్మెల్యేలకు సంఘం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

చెత్త కాల్చివేతతో ముప్పు



ధన్వాడ: చెత్తను కాల్చివేయకుండా ప్రతి ఇంటికి సేకరించి వ్యర్థ పదార్థాలను వేరు చేసి రీసైక్లింగ్ చేయాల్సి ఉండగా కొన్ని గ్రామాల్లో వాటిని కాల్చివేసి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు. మండలంలోని యంనోనిపల్లి గ్రామ శివారులో ఉన్న డంపింగ్ యార్డులో చెత్తను తగులబెడుతున్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి డంపింగ్ యార్డులను నిర్మించి గ్రామంలో సేకరించిన చెత్తలో అవసరం ఉన్న మిగతా వాటిని ఎరువుల తయారీకి ఉపయోగించాల్సి ఉంది. అలా తయారు చేసిన కంపోస్టును రైతులకు అమ్మివచ్చిన డబ్బులను గ్రామ పంచాయతీ అవసరాలకు ఉపయోగించాలి. కానీ, ఇక్కడ మాత్రం దానికి విరుద్ధంగా కొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్తను తగులబెడుతున్నారు.

భూసారంపై శ్రద్ధ లేదా?



అడవిసత్యరం శివారులో వరి కొయ్యలకు నిప్పుపెట్టిన రైతులు

- వరికోతల అనంతరం కొయ్యలు, వరిగడ్డిని దహనంచేస్తున్న రైతులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాగనూర్: కొన్నేళ్ల కిందట వరికోతల అనంతరం గడ్డిని కుప్పలుగా వేసి పశువులకు మేతకు ఉపయోగించేవారు. ప్రస్తుతం కూలీల కొరత ఉండటంతో రైతులు కోతలకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. అనంతరం పొలంలో మిగిలిన కొయ్యలతో పాటు గడ్డిని నిప్పంటిస్తున్నారు. అవగాహన లోపంతో అన్నదాతలు ఇలా చేస్తుండటంతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలా చేయడంతో పంట దిగుబడి ఆశించినస్థాయిలో రాదని చెబుతున్నారు. పంటలకు కీడుచేసే పురుగులను తినే వానపాములు, కీటకాలు నశించే ప్రమాదం ఉందని చెబుతున్నారు. భూమిలోని అవశేషాలు, ఖనిజ లవణాలు నశిస్తాయంటున్నారు. ప్రస్తుతం చలికాలం కావడంతో ఎక్కువ మొత్తంలో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది.

గడ్డికి నిప్పంటిస్తే..

వరిపొలంలో గడ్డికి నిప్పంటిస్తే ఆ భూమిలో ఒక సెంటీమీటర్ లోతు వరకు భూమిపై పొరలో మట్టి 33.8 నుంచి 42.2 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రతకు గురవుతుంది. అత్యంత కీలకమైన జీవరాసులు, శిలింద్రాల సంతతి నశించిపోతుందని, భూమి సేంద్రియ లక్షణం నాశనమవుతుంది. భూమిపై పొరలో మేలుచేసే మిత్రపురుగులు నశించడంతో పంటలపై పురుగుల దాడి పెరిగిపోతుంది. టన్నుల పంటవ్యర్థం తగులబెట్టినప్పుడు మట్టిలో సేంద్రియ కార్బనంతోపాటు (5.5 కిలోల నత్రజని, ఫాస్పరస్, 25 కిలోల పొటాషియ, కిలోకు పైగా గంధకం) 33.8 పోషకాలు నాశనమవుతాయి.

ఇలా చేస్తే మేలు..

- పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.
- పంటల కోత పూర్తయిన తరువాత మిగిలిన పంటల అవశేషాలను భూమిలో మరుగబెట్టి దుక్కిలో కలిపి దున్నాలి. ఇలా చేయడంతో వరిగడ్డి భూమిలో మరిగి సేంద్రియ ఎరువుగా మారుతుంది.
- మిగిలిన వరి కొయ్యలు, వరిగడ్డిల్లోనే యూరియా, పాస్ఫెట్‌లను కలిసి వేస్తే వారంలోనే మురుగుతాయి.

భూసారం తగ్గుతుందని తెలియదు..



పంటకోత యంత్రాలు అందుబాటులో వచ్చినప్పటి నుంచి మిగిలిన కొయ్యలను, గడ్డిని తగలబెడుతున్నాం. ఇలా చేస్తే భూసారం తగ్గుతుందని తెలియదు. దీనిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– డొల్లె నరేష్, రైతు మాగనూర్

సమయం ఆదాకోసం..



ప్రస్తుత కాలంలో రైతులకు గడ్డిని పోగేసి, కొయ్యలను మురుగబెట్టేంత సమయం లేకుండా పోయింది. కూలీల సమస్య కూడా తీవ్రంగా ఉండటంతో సమయం ఆదాకోసం తగ్గలబెటడం కోసం ఇలా చేయడం తప్పడం లేదు.

– మారెప్ప, రైతు, మాగనూర్

చర్యలు తీసుకుంటాం..



పంట భూముల్లో గడ్డి, వరి కొయ్యలను దహనం చేస్తే భుసారాన్ని కోల్పోతోంది. అవసరం లేని గడ్డిని భూమిలోనే కలిపి దున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూమికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. గడ్డి, కొయ్యల దహనంతో వాతావరణం కాలుష్యమవుతుంది. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

– సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏవో, మాగనూర్

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులకు బహుమతులను అందజేస్తున్న తహసీల్దార్ జయరాములు

మద్దూరు: మండల మహిళా సమాఖ్య, కమిట్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య కార్యాలయం నుంచి కొత్తబస్టాండ్, పాతబస్టాండ్ మీదుగా దివ్యాంగుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో తహసీల్దార్ జయరాములు, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ విజయలక్ష్మి తదితరులు మాట్లాడుతూ.. శరీరానికి మాత్రమే వికలత్వం మన మనసుకు కాదన్నారు. ఆత్మస్థైర్యంలో ముందుకు సాగుతే విజయం మన చెంతన ఉంటుందన్నారు. అనంతరం దివ్యాంగులకు బహుమతులను అందజేశారు. అలాగే పేట డిపో సిబ్బంది ఆశప్ప వందమంది దివ్యాంగులకు బస్సు పాసులు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సాయిబన్న, రాధమ్మ, మహిళా సమాఖ్య సంఘం నాయకులు అనిత, పుష్పమ్మ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరస్వామి జాతర ప్రారంభం



ఉమామహేశ్వరస్వామి దేవస్థానం



మూలవిరాట్

ధన్వాడ: మండలంలోని యంనోనిపల్లిలోని గుట్టపై వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థాన జాతర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు సర్పంచ్ భారతిసచిన్ తెలిపారు. ఈ జాతర ఉత్సవాలు సోమవారం నుంచి మూడురోజులపాటు కొనసాగనున్నాయి. ఉత్సవాలకు మండలంతో పాటు ఇతర మండలాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో రానున్నారు. 12న స్వామివారి జలాభిషేకం, మంగళగౌరి బోనాలు, అగ్నిగుండం, అన్నదానం, రెట్టపట్ల కార్యక్రమాలు, 13న స్వామివారి ఊరేగింపు పల్లకిసేవ నిర్వహించి జాతర ఉత్సవాలను ముగించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా దేవస్థాన కమిటీ సభ్యులు కోరారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే శ్రీహరిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాగనూర్: మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం ఆయనను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల ప్రజల తరుపున వాకిటి శ్రీహరికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం మక్తల్ ఎమ్మెల్యే కూడా అధికార పార్టీకి చెందినవాడు కావడంతో నియోజకవర్గంతో పాటు మాగనూర్ మండల కేంద్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు వాకిటి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, దండు సత్యనారాయణ, యాకుబ్‌ఆలీ, ఆనంద్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ట్రాఫిక్ వెతలు



గురువారం రాత్రి సిగ్నల్‌గడ్డపై ట్రాఫిక్‌జాం

జడ్చర్ల టౌన్: సిగ్నల్‌గడ్డపై నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్‌జాంలో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ కష్టాలు ఎప్పుడు తీరుతాయో.. లేదోనని ఆవేదన చెందుతున్నారు. 167వ నంబరు జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎల్‌బీసీ కార్యాలయం నుంచి డిగ్రీ కళాశాల హాస్టల్ వరకు 750మీటర్ల మేర పనులు ఆలస్యంగా ప్రారంభించారు. దీనికితోడు రైల్వేలైన్‌పై బ్రిడ్జ్ ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లు విస్తరణ జరగకపోవటంతో సమస్య ఉత్పన్నం అవుతోంది. గురువారం రాత్రి సైతం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు అడ్డదిడ్డంగా సాగిస్తుండటంతో తరచూ సమస్య ఏర్పడుతోంది. బారికేడ్లు రాత్రిళ్లు కానరాకపోవటంతో వాహనదారులు వాటికి ఢీకొట్టి ప్రమాదాల బారిన పడ్డారు. పోలీసులు ఇప్పటికైనా మరోసారి బారికేడ్లు ఏర్పాటు చేసి అవి స్పష్టంగా కనిపించేలా లైటింగ్‌ఏర్పాటు చేస్తే సమస్య కొంత తీరుతుందని పలువురు కోరుతున్నారు.

పాఠశాలల ఆవరణలు శుభ్రంగా ఉంచుకోవాలి



తాగునీటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కోయిల్‌కొండ: పాఠశాలల ఆవరణలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మండలంలోని మల్కాపూర్ ఉన్నతపాఠశాలను ఆయన సందర్శించారు. తాగునీటి ట్యాంకు తదితరాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. అనంతరం రాంపూర్‌లో నర్సరీని పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాహకులను కోరారు.

నత్తనడకన గిడ్డంగి పనులు



ధర్మాపురం శివారులో నిర్మిస్తున్న గిడ్డంగి

అమరచింత: మండలంలోని ధర్మాపురం శివారులో నిర్మిస్తున్న గిడ్డంగి నిర్మాణం నత్తనడకన కొనసాగుతుంది. పనులను నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు నాణ్యతలను పరిశీలించేందుకు రావడం లేదు. రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్‌గా సాయిచంద్ కొనసాగుతున్నప్పుడు తన సొంత మండలానికి 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉండేలా రూ.10కోట్ల నిధులను మంజూరు చేశారు. సాయిచంద్ మరణాంతరం గిడ్డంగి పనులను రజనిసాయిచంద్ చైర్‌పర్సన్‌గా ముందుండి కొనసాగించారు. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ పనులను చేపట్టలేక పోతున్నాడు. ఇప్పటికైన అధికారులు స్పందించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.



కోస్గిలో సంబురాలు చేసుకుంటున్న యువకులు



మక్తల్‌లో ..

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నారాయణపేట: హైదరాబాద్‌లోని ఎల్‌బీస్టేడియంలో గురువారం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చేస్తున్న ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి పిలుపుమేరకు నారాయణపేట నియోజకర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

డీఎస్పీ కిషన్ రెడ్డిని కలిసిన పేట కాంగ్రెస్ నాయకులు

గతంలో ఉమ్మడి జిల్లా హెడ్‌క్వార్టర్‌లో పలు హోదాలలో విధులు నిర్వహించిన డీఎస్పీ కిషన్ రెడ్డిని బీఆర్‌ఎస్ అధికార దాహంతో అధికారులను ముప్పు తిప్పలు పెట్టి బదిలీలలతో ఏకంగా ఉద్యోగ విరమణకు పూనుకున్నారని మార్కెట్ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో తిరిగి ప్రభుత్వ వ్యవస్థలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కిషన్‌ను కలిసి అభినందనలు తెలిపినట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ నాయకులు ధన్వాడ వెంకట్‌రాంరెడ్డి, గోటూర్ నాగేశ్వర్‌రెడ్డి, శేరి వెంకటపూర్, వెంకటేశ్వర్‌రెడ్డి, వత్తుగుండ్ల జయదేవ్ రెడ్డి, వెంకుగౌడ్, సీపీఎం నాయకులు రాము, కాశీనాథ్, మైనోద్దీన్, కాశన్న, యాదగిరి, వెంకట్రాములు తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారోత్సవానికి తరలివెళ్లిన పేట కాంగ్రెస్ నాయకులు

కోస్గి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయడంపై ఆ పార్టీ నాయకులు, యువకులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. మండల పరిధిలోని నాచారం గ్రామంలో సర్పంచ్ వెంకట్రాములు ఆధ్వర్యంలో యువకులు గ్రామంలోని వివేకానంద చౌరస్తాలో బాణా సంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మరికల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయడంపై మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు.. బాణాసాంచా కాల్చి, పార్టీ కార్యకర్తలకు స్వీట్లను పంచుకున్నారు. కార్యక్రమంలో రాజు, ఆనంద్‌కుమార్, సూర్యప్రకాష్, రఘు, రామకృష్ణ, నాగరాజ్, రాములు, మల్లేష్, శేఖర్, ఆంజనేయులు, మహిమూద్, వెంకటేష్, విజయ్, మహేష్ పాల్గొన్నారు.

మక్తల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయడంపై పట్టణంలోని కాంగ్రెస్ మండల నాయకులు బాణాసంచా కాల్చి, పార్టీ కార్యకర్తలకు స్వీట్లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార శాఖ చైర్మన్ కోళ్ల వెంకటే ష్, కాంగ్రెస్ నాయకులు రహింపటేల్, శంసోద్దీన్, మందుల నరేందర్, కావలి తాయప్ప, ఎండీ సలా, అబ్దుల్ రహిమాన్, కట్ట వెంకటేష్ తదితరులు ఉన్నారు.

దామరగిద్ద: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు సంబరాలు నిర్వహించారు. ఆరు గ్యారంటీల అమలకోసం సంతకం చేయడంపై ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం హర్షణీయమన్నారు



ధన్వాడలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ధన్వాడ: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయడంపై ఆ పార్టీ నాయకులు, యువకులు సంబరాలు చేసుకున్నారు. శంకర్, రహిమాన్ ఖాన్, రాంచంద్రయ్య, నర్సింహులు, ఆచ్చిబాబు, అబ్దుల్‌ఖాదర్, జలీల్, నరేందర్‌గౌడ్, యుసుఫ్, బాబా పాల్గొన్నారు.

ప్రకృతి వనం అక్రమార్కుల పరం

- కలెక్టర్, తహసీల్దార్ ఆదేశాలు బుట్టదాఖలు
- అధికారులు ఎన్నికల నిర్వహణలో ఉండగా జోరందుకున్న అక్రమ నిర్మాణాలు
- సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల ఫిర్యాదులకు స్పందన కరువు



పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన చెట్లను జేసీబీతో పెకిలించిన దృశ్యం

మహబూబ్‌నగర్ రూరల్: అక్రమ దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన వెంకటాపూర్‌లో పల్లె ప్రకృతి వనానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కూడా మాయం చేసే ఘనులు ఉన్నారంటే అతిశయోక్తి లేదు. ఇప్పటికే ఇసుక మాఫియా వంటి కార్యకలాపాలకు అడ్డాగా మారిన వెంకటాపూర్‌లో ఇప్పుడు కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ భూములు, ఖాళీ జాగాలపై కన్నేశారు. గ్రామంలో 108 సర్వేనంబర్‌లో మొత్తం తొమ్మిది ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇందులో కొంతభాగం గ్రామకంఠం, మరికొంత అసైన్డ్ భూమి, 40 మందికి గతంలో 120 గజాల చొప్పున ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించారు. అయితే ఇదే సర్వేనంబర్‌లో మిగిలిన భూమిని పల్లె ప్రకృతి వనం కోసం కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు ప్రాధాన్యత ఇచ్చి అందుకు స్థలాలను కేటాయిస్తే ఈ స్థలాలను కూడా కాజేసేందుకు అక్రమార్కులు దౌర్జన్యాలకు, భౌతిక దాడులకు దిగుతుండటం అధికార యంత్రాంగానికి, ముఖ్యంగా రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. పల్లె ప్రకృతి వనం స్థలం జోలికి వస్తే సహించేది లేదని.. ఇదే చివరి అలిమెట్టం అని గత తహసీల్దార్ పాండు హెచ్చరికలు జారీ చేసినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదు. పైగా కొత్తగా పల్లె ప్రకృతి వనం స్థలం 4 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. మహబూబ్‌నగర్ – కోయిలకొండ ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన విలువైన స్థలం ఉన్నందున గ్రామంలోని కొంత మంది అక్రమార్కులు ఎవరికీ వారుగా కబ్జా చేసుకొని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. రైతువేదిక ముందు పల్లె ప్రకృతి వనం బోర్డు ఉంది. అక్కడి సమీపంలో వనం చుట్టూ ఉన్న ఖాళీగా జాగాలపై ఎవరికీ వారుగా ఆక్రమణ చేసుకొని ఇళ్లు, షెడ్ల నిర్మాణాలు చేపడుతుండటం కనిపిస్తోంది. ఈ వ్యవహారంపై సర్పంచ్ మంగమ్మ ప్రజల తరపున తహసీల్దార్, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారుల ఆదేశాలు ఇచ్చినా కూడా బుట్టదాఖలు అయ్యాయి. అధికారులు ఎన్నికల విధి నిర్వహణలో ఉండగా వెంకటాపూర్‌లో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈ నిర్మాణాలు ఆపాలంటూ ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. అయితే మండల స్థాయి రెవెన్యూ అధికారుల పనితీరుపై కొంత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది మధ్యవర్తులచే రెవెన్యూ సిబ్బందికి పెద్దఎత్తున మాముళ్లు ముట్టాయని తెలుస్తోంది. అందుకోసమే వారు పట్టించుకోవడం లేదనే చర్చ గ్రామంలో జోరుగా సాగుతోంది.

అక్రమార్కులపై చర్యలు



ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇక వెంకటాపూర్ గ్రామంలో 108 సర్వేనంబర్‌లో గల స్థలాలను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలకు పూనుకున్నారనే విషయంపై ఫిర్యాదు అందింది. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉన్నందున అక్రమ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించలేదు. ఇప్పుడు ఎన్నికలు అయిపోయాయి గనుక వెంకటాపూర్ గ్రామాన్ని సందర్శించిన పల్లె ప్రకృతి వనం స్థలంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

–సుందర్‌రాజ్, తహసీల్దార్, మహబూబ్‌నగర్ రూరల్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. వ్యవసాయ పొలంలో ఉన్న ఈ స్తంభం రోడ్డు వైపు ఒరిగి ఉంది. దీంతో అది ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కూతవేటు దూరంలోనే అడ్డాకుల విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. ఈ స్తంభం మూలంగా ఎలాంటి ప్రమాదం సంభవించక ముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.